ఎస్‌డిసిలకు బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి

విజయనగరం కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.వి.సూర్యనారాయణ శ్రీకాకుళం కెఆర్‌ఆర్‌సికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎం.సుమబాల నియమితులయ్యారు. చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం.అప్పారావు శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సిఇఒగా బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ డిపిఎంగా పనిచేసి, పోస్టింగ్ కోసం వేచి ఉన్న బి.పద్మావతి శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ ఎస్‌డిసిగా నియమితులయ్యారు. కాకినాడ ఎపి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఎస్‌డిసి కె.సుధారాణి.. చీపురుపల్లిలోని తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు యూనిట్-2 ఎస్‌డిసిగా బదిలీపై వచ్చారు. బొబ్బిలి ఆర్‌డిఒ శేషశైలజ విశాఖపట్నం కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసిగా బదిలీపై వెళ్తున్నారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.లావణ్య పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్‌డిఒగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం డిఆర్‌ఒ రాజేశ్వరి.. విజయనగరం డిపిఎంగా నియమితులయ్యారు.

రైతు కంటతడి

- పొట్టదశలో వరికి అందని నీరు
- వర్షాభావంతో తల్లడిల్లుతున్న రైతులు
- ఎండిపోతున్న పంటలు

వర్షాభావ కారణంగా వరి పంట ఎండిపోయే పరిస్థితితో రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మండలాల్లో ఈ ఏడాది సాగు నీరందక వరి పంట ఎండిపోయే ప్రమాదంలో పడింది. ముఖ్యంగా పొట్టదశలో నీరందక చాలా చోట్ల వరి ఎండిపోతుంది. అధికారులు సైతం పంట నష్ట పరిహారాన్ని అంచనా వేసే పనిలో దిగారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చును. సాగునీటి ప్రాజెక్టులు కింద ఉన్న పొలాల పరిస్థితి కూడా ఇలాగే ఉందని రైతులు చెబుతున్నారు. కాగా చివరి పోరాటంగా చెరువులో అడపా దడపా ఉన్న నీటిని మోటారు సహకారంతో తోడించి వరి పంటను బతికించుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు.

ఎండిపోతున్న వరిపైరు

బకెట్‌తో నీరు పోస్తున్న రైతు

గూడతో పొలానికి నీరుపెడుతున్న రైతులు

ప్రజాశక్తి- డెంకాడ, వేపాడ

డెంకాడ మండలమంతా వర్షాధారంపైనే ఆధారపడి ఉటుంది. 75 శాతం వరకు ఏ పంట పండాలన్నా వర్షం పడితేనే పండుతుంది. కేవలం 25 శాతం బోర్ల ద్వారా పంటలు పండిస్తున్నారు. మండలంలో సుమారు 13,750 ఎకరాల్లో వరి సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఏడాది 11,715 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఆగస్టులో ఉబాలు పడిన తరువాత అనుకున్న స్థాయిలో వర్షాలు పడలేదు. సుమారు రెండు నెలలుగా వర్షాలు పడకపోవడంతో పొట్టదశకు వచ్చిన వరి పంట ఎండిపోతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉబాలు తరువాత వర్షాలు లేకపోవడంతో ఒకటి రెండు సార్లు చెరువులో ఉన్న నీటిని తోడుకుని వరి పంటను బతికించుకున్నారు. ఇప్పుడు కచ్చితంగా పొట్టదశకు వచ్చేసరికి చెరువులో కూడా నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేపాడ మండలంలో జగ్గయ్యపేట, వేపాడ, వల్లంపూడి, సింగరాయి, ఆతవ, ఎం.సింగవరం, బానాది, బల్లంకి, కొంపల్లి, కెఆర్‌పేట గ్రామాల్లో కేవలం వర్షాధారంపై ఆధారపడి వరిసాగుతుంది. ప్రస్తుతం తీవ్ర వర్షాభావంతో వరి పొలాలు ఎండిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పొట్ట దశలో కొన్నిచోట్ల ఉంది. పూత దశలో, గింజకు పాలు పోసుకునే దశలో ఉండడంతో పంటను ఎలాగైనా కాపాడుకోవాలని రైతులు తాపత్రయ పడుతున్నారు. ఆయిల్ ఇంజిన్లతో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఈ వారం రోజుల్లో వర్షాలు రాకుంటే ఐదు వేల ఎకరాల్లో పంట నష్టం తప్పదని అంచనా వేస్తున్నారు.

ఆయిల్ ఇంజిన్‌తో నీరుపెట్టిన రైతు

వేల ఎకరాల్లో పంట నష్టం

మరో పది రోజుల్లో వర్షాలు పడకపోతే డెంకాడ మండలంలో 7500 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా భూముల్లో ప్రస్తుతం తడి ఉన్నా వర్షాలు పడకపోవడంతో తెగుళ్లు వచ్చి పంట నష్టపోయే పరిస్థితి ఉందని చెబుతున్నారు. పైనుంచి వర్షం పడితే తప్ప తెగుళ్లు పోవని చెబుతున్నారు. ముఖ్యంగా అమకాం, గొలగాం, జొన్నాడ, బొడ్డవలస, మోపాడ, డి తాళ్లవలస, డెంకాడలో కొంత భాగం పినతాడివాడలో కొంత భాగం వరి పంట ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఎకరాకు రూ.20 వేలు నుంచి 40 వేల వరకు మదుపులు పెట్టి వ్యవసాయం చేశామని పంట చేతికి రాకపోతే అప్పుల పాలైపోతామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎండిపోతున్న పైరు

లక్షకుపైగా ఖర్చుపెట్టాను

మా గ్రామంలో మూడు ఎకరాలు పొలంలో వరి వేశాను. ఇప్పటివరకు సుమారు లక్ష రూపాయలపైన ఖర్చు పెట్టాను. పంట చేతికి వస్తే అప్పులు తీరుతాయనుకున్నాను. కానీ వర్ష భావం వల్ల వరి చేను ఎండిపోయే స్థితికి వచ్చింది. వర్షాలు లేకపోవడంతో పొలంలో ఉన్న నుయ్యి నీరు, పక్కనే ఉన్న పొలం నీరు కూడా చాలడం లేదు. పైగా వీటికి మోటారు పెట్టి నీటిని తోడించడం వల్ల ఖర్చు పెరిగిపోతుంది. ఇప్పుడు వరి పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో వర్షం పడితేనే పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. లేకపోతే పంట పోతుంది.

- ఆకుల వాసుదేవరావు, రైతు, మోపాడ, డెంకాడ మండలం

పంటంతా పోతుంది

నాకున్న రెండు ఎకరాల భూమిలో వరిసాగుచేస్తున్నాను. సుమారు 60 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాల్లేక పంటంతా ఎండిపోతోంది. వారం రోజుల్లో వర్షం పడకుంటే పంటంతా పోతుంది. కనీసం మదుపులు కూడా వచ్చే అవకాశం లేదు.

-మంచిన అప్పలసూరి. రైతు, ఆకులసీతంపేట, వేపాడ మండలం

నిర్మాణంలో ఉన్న విమానాశ్రయ రక్షణగోడ

విమానాశ్రయ పనులకు 1న భూమిపూజ

నిర్మాణ పనులను ఎల్అండ్‌టి సంస్థకు అప్పగించిన జిఎంఆర్

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులకు సంబంధించిన భూమి పూజ నవంబర్ ఒకటో తేదిన ఎల్అండ్‌టి సంస్థ చేయనుంది. విమానాశ్రయ పనులను ఇప్పటికే ప్రభుత్వం జిఎంఆర్ సంస్థకు అప్పజెప్పిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే జిఎంఆర్ సంస్థ ప్రహరీగోడ నిర్మాణ పనులను వేరే సంస్థకు ఇవ్వగా, తాజాగా విమానాశ్రయ నిర్మాణ పనులను మరో ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టికి సబ్ కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎల్ అండ్ టి సంస్థ ప్రతినిధులు సుమారు 20 రోజుల కిందట ఇక్కడ చేరుకున్నారు. తమ సిబ్బందికి కావాల్సిన కార్యాలయాలు, నివాసాల కోసం విమానాశ్రయ భూములు చుట్టూ ఉన్న దల్లిపేట, గూడెపువలస, కంచేరు, భోగాపురం తదితర గ్రామాల్లో తిరుగుతున్నారు. అవసరమైన గృహాలు, కార్యాలయాలను అద్దెకు కూడా తీసుకున్నారు. కూలీల కోసం తాత్కాలిక షెడ్లను వేసేందుకు కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం విమానాశ్రయ భూముల చుట్టూ ప్రహరీగోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

కవులవాడ సమీపంలో భూమిపూజ

విమానాశ్రయ నిర్మాణ పనులకు సంబంధించిన భూమి పూజను నవంబర్ ఒకటో తేదిన చేయాలని ఎల్అండ్‌టి సంస్థ నిర్ణయించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. కవులవాడ సమీపంలో సేకరించిన భూముల వద్ద ఈ భూమి పూజ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ భూమిపూజకు ఎల్అండ్‌టి సంస్థతోపాటు జిఎంఆర్ సంస్థ ఉన్నత స్థాయి అధికారుల హాజరయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఈ భూమి పూజ తర్వాత భూమిని చదును చేసే పనులు ప్రారంభం అవుతాయి.

చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గొర్రెల పెంపకందారులకు అండగా ఉంటాం

తప్పెటగుళ్ల కళాకారులకు ప్రోత్సాహం : విద్యాశాఖామంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

గొర్రెలు పెంపకందారులు వారి వృత్తిని కొనసాగించేందుకు అండగా నిలుస్తామని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. తప్పెటగుళ్ల కళాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. జిల్లా పరిషత్తు నిధులతో 200 మంది గొర్రెల పెంపకందారులకు సుమారు రూ.8.21 లక్షలు విలువైన రెయిన్ కోట్లు, టార్చి లైట్లు, కంచె వలలను, రూ.5 కోట్ల రుణాలను ఆదివారం పంపిణీ చేశారు. జెడ్‌పి సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స మాట్లాడారు. డిసిసిబి నుంచి 7 శాతం వడ్డీతో తీసుకున్న ఈ రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లిస్తే, వారికి పావలా వడ్డీ వర్తిస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సున్నా వడ్డీ వర్తింపజేసేందుకు కూడా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో యూనిట్ రూ.1.60 లక్షలతో 20 గొర్రెలు, ఒక గొర్రెపోతును కొనుగోలుకు పెంపకందారులకు ఈ రుణాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు. తప్పెటగుళ్ళ అన్నది గొప్ప కళని, ముఖ్యంగా పెంపకందారులే ఎక్కువగా ఈ కళలో నిష్ణాతులుగా ఉన్నారని అన్నారు. వారి కళను ప్రదర్శించేందుకు అవసరమైన పరికరాలను, కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జిల్లాలో గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి ఆ సంఘం అధ్యక్షులు మన్యాల కృష్ణ ఎంతగానో కృషి చేస్తున్నారని అభినందించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల్లో అర్హులు మిగిలిపోతే, వారికి కూడా ఉపకరణాలు, రుణాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షులు మన్యాల కృష్ణ, ఇతర నాయకులు, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు, డిడి వైవి రమణ, డిసిసిబి సిఇఒ జనార్ధన్, జెడ్‌పి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మనం చేసే రక్తదానం... ఆపద సమయంలో మరొకరి ప్రాణాలను నిలుపుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణం నుంచి వాక్ ఫర్ విజయనగరం ర్యాలీని ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ తాము జీవిస్తున్న ఊరికి ఎంతో కొంత మేలు చేయాలని.. అప్పుడే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయేమోనని చాలా మందికి అపోహ ఉందని, దీనిపై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.

అమరావతి ఎగ్జిబిషన్ ప్రారంభం

నగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ట్రేడ్ ఫైర్ ఎగ్జిబిషన్‌ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంపడపు విజయలక్ష్మి, ఎగ్జిబిషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి, గోల్డ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

29, 30న ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ టోర్నీ

విజయనగరంటౌన్ : పైడితల్లమ్మ జాతర, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. ఆదివారం విజయనగరంలో విలేకరుల సమావేశంలో సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాట్‌పై పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 26వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపాలని కోరారు. క్రీడాకారులకు భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ 95733 63564, 80748 58972 నంబర్లను సంప్రదించాలని కోరారు. కబడ్డీతోపాటు వాలీబాల్, ఖోఖో, తైక్వాండో, కరాటే, స్విమ్మింగ్, హాకీ, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.సూరిబాబు, క్రీడా సంఘాల ప్రతినిధులు బి.రామారావు, డి.అచ్యుతరావు, బాలకృష్ణ, సి.హెచ్.వి.ఆర్.రాజు, కె. తౌడుబాబు, కె.శంకరరావు, సూర్యారావు, ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఉత్సవ చాటింపు

విజయనగరంటౌన్ : పైడితల్లమ్మ సిరిమానోత్సవ చాటింపు కార్యక్రమం ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుధారాణి, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఒబి పూర్తయ్యేదెప్పుడు?

- అసంపూర్తిగా పెదమానాపురం రైల్వే వంతెన పనులు
- పెరిగిన వాహన రాకపోకలు
- మునుపెన్నడూ లేని విధంగా ట్రాఫిక్ జామ్
- ప్రయాణికులు, స్థానికులకు తీవ్ర అవస్థలు

అర్థాంతరంగా నిలిచిన రైల్వే వంతెన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జిల్లాలో అత్యంత రద్దీ మార్గంలోని పెదమానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి అర్థాంతరంగా నిలిచిపోయింది. పదేళ్లుగా పూర్తికాని వంతెనగా ఇది రికార్డులకెక్కింది. జిల్లా వాసుల్లో ప్రతిఒక్కరి నోటా ఇదే మాట. ఫలితంగా అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు, మరోవైపు స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రధానమార్గం ఇదే కావడం, వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో నానాపాట్లు పాడుతున్నారు. నిర్మాణ పనులు ఎక్కడివక్కడ వదిలేయడంతో రోడ్డంతా గుంతలమయమై ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

విజయనగరం నుంచి రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడ, ఇటు సాలూరు, సుంకి మీదుగా ఒడిశా వెళ్లే 26వ నంబరు జాతీయ రహదారి ఇది. అందుకే నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రధానమైన 26వ నంబర్ జాతీయ రహదారిలో పెదమానాపురం వద్దనున్న రైల్వేగేటుతో నిత్యం వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండటంతో 2013లో ఫ్లైఓవర్ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు పదేళ్లు పూర్తికావస్తున్నా ఆర్‌ఒబి నిర్మాణం పూర్తికాలేదు. ఇప్పటివరకు రైల్వేట్రాక్‌కి ఇరువైపులా నాలుగు పిల్లర్లు మాత్రమే నిర్మించారు. మొత్తం బ్రిడ్జి పూర్తవడానికి పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణంతో పాటు ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలి. కానీ ఇంతవరకు అటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యావసానం ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గతేడాది జనవరిలో రోడ్డు విస్తరణ కోసం నిర్వాసితులకు పరిహారం అందజేసి, ఖాళీ చేయించి చకచకా పనులు ప్రారంభమైనా మూడు అడుగుల ముందుకు.. ఆరడుగుల వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కాలువలు పూర్తిచేసి, డైవర్షన్ రోడ్డు వేసేందుకు పనులు చేపట్టి అర్థాంతరంగా నిలిపేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డైవర్షన్ రోడ్డులో గోతులు ఏర్పడటంతో వాహనాలు ఎప్పటికప్పుడు నిలిచిపోతున్నాయి.

అందరికీ పాట్లే

మానాపురం గేటు పడితే వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకూ గేటు తీసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎండవేడిని తట్టుకోలేక వాహనదారులు, బస్సులో వృద్ధులు, చిన్నారులతో ప్రయాణించేవారు తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు.. పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డుపై దుమ్ము, ధూళితో స్థానికులు కూడా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రతి పది నిమిషాలకు రైల్వే గేట్ పడటంతో స్థానిక పోలీసులు ఎండలోనే ఉండి ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం నిత్యం నరకప్రాయంగా ఉందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఫ్లైఓవర్ పనులు చేపట్టేలా చర్యలు చేపట్టి, ప్రయాణికుల కష్టాలకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాకు 30 కొత్త బస్సులు

- ప్రభుత్వంలో విలీనం తర్వాత ఆర్థికంగా వెసులుబాటు
- స్పెషల్ డ్రైవ్‌తో బస్సులకు మరమ్మతులు
- 'ప్రజాశక్తి'తో డిపిటిఒ అప్పలనారాయణ ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం కోట

'వచ్చే ఏడాది జనవరిలో జిల్లాకు 30 కొత్త బస్సులు రానున్నాయి. ప్రభుత్వంలో ఎపిఎస్‌ఆర్‌టిసి విలీనం కావడంతో ఆర్‌టిసి అధికారులకు ఆర్థిక వెసులుబాటు లభించింది. దీంతో డిపోల నిర్వహణ కొంతమేర సులభతరం అవుతోంద'ని విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లా పరిధిలో ఎన్ని బస్సులు ఉన్నాయి.?

విజయనగరం జిల్లా పరిధిలో విజయనగరం, శృంగవరపుకోట డిపోల్లో 171 బస్సులు ఉన్నాయి. అందులో 115 ప్రభుత్వ బస్సులు, 56 అద్దె బస్సులు ఉన్నాయి. సూపర్ లగ్జరీ బస్సులు 5, డీలక్స్ బస్సులు 24, ఎక్స్‌ప్రెస్‌లు 14, మెట్రో 14, పల్లె వెలుగు బస్సులు 106 ఉన్నాయి. జెఎన్ఎన్‌యుఆర్ఎం ద్వారా 10 బస్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు 63 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. దీనివల్ల రెండు డిపోలకు రోజుకు రూ.27 లక్షలు ఆదాయం వస్తోంది.



ఆర్‌టిసి లాభనష్టాలు సంగతేమిటి.?

విజయనగరం జిల్లాలో 2021-22కు సంబంధించి ఆర్‌టిసికి రూ.51 కోట్లు నష్టం వాటిల్లింది. 2022-23 గాను సంస్థకు రూ.30 కోట్లు నష్టం వచ్చింది. మునుపటి ఏడాది కంటే 20 కోట్లు నష్టం తగ్గింది.

జిల్లాలో ఎక్కువగా కాలం చెల్లిన బస్సులు తిప్పడం వల్ల తరచూ చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై మీరేమంటారు.?

ప్రస్తుతానికి జిల్లాలో కాలం చెల్లిన బస్సులంటూ ఏమీ లేవు. 24వ తేదీతో శృంగవరపుకోట డిపోకు చెందిన బస్సు కాలం పూర్తయింది. దాన్ని ఆ రోజుతోనే నిలిపేస్తున్నాం. గతంలో ఒక బస్సు కాలపరిమితి 13 లక్షల కిలోమీటర్లు తిరిగితే ఆపేయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు 15 ఏళ్ల కాల పరిమితిగా పెట్టారు. 2022లో 16 బస్సులు కాలం చెల్లినవి ఉంటే వాటిని నిలుపుదల చేశాం. 25 బస్సులు మరమ్మతులకు గురయ్యాయి. వీటికి కిటికీలు, గ్లాసులు, రూఫ్ వర్క్, టైర్లు తదితర స్పేర్ పార్ట్స్ అన్ని వేసి, ఒక్కొక్క బస్సుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసి మరమ్మతులు చేశాం. 2020లో ప్రభుత్వంలో విలీనమైన తరువాత స్పేర్ పార్ట్స్ ఏవీ రావడం లేదు. వస్తున్న ఆదాయం నుంచే తీసుకొని మరమ్మతులు చేస్తున్నాం. ఇటీవల కాలంలో రూ.6 కోట్లతో స్పేర్ పార్ట్స్, టైర్లు, గ్లాసులు, ఇతర వస్తువులు కొనుగోలు చేశాం.

కమర్షియల్ షాపుల ఆదాయం ఎలా ఉంది.?

జిల్లాలో రెండు డిపోల్లో 228 షాపులు అద్దెకు ఇచ్చాం. వీటి ద్వారా నెలకు ఆర్‌టిసికి 25 లక్షల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి.?

ఉద్యోగుల భద్రత దృష్ట్యా చర్యలు చేపడుతున్నాం. ప్రతినెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి, వారి సమస్యలను తెలుసుకుంటున్నాం. గత నెలలో 59 సమస్యలు వచ్చాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వంలో విలీనం తరువాత పరిస్థితి ఏమిటి.?

ప్రభుత్వం 2020 జనవరిలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో జిల్లాలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. జీతాల భారం ప్రభుత్వమే భరిస్తుంది. ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ పెరుగుదల వల్ల అనుకున్న స్థాయిలో ఆదాయాలు పెరగడం లేదు. లిఫ్ట్ 1/19 జిఒ ప్రకారం డిపోలలో ముందుకెళ్తున్నాం. ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి తేకుండా, వారి సహకారంతో సంస్థను ముందుకు తీసుకెళ్తున్నాం.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బొబ్బిలి: రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం వైసిపి పట్టణ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి ఎందుకు మరల సీఎం కావాలో ప్రజలకు వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారంలోకి వస్తుందని, బొబ్బిలిలో కూడా తాను విజయం సాధిస్తానని జోష్యం పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గమైన విధానాలను ఓటుతో కొట్టాలి

వేపాడ: సిఎం జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గమైన విధానాలను ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో తిప్పి కొట్టాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కోరారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ వేధించడంతో పాటు దాడులు చేస్తున్న ఈ ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబును 43 రోజులుగా రిమాండ్ ఖైదీగా చూపుతూ మానసికంగా హింసిస్తున్నారని ఇటువంటి చర్యలను ఖండించాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

భోగాపురం: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ సెలవులు, జిపిఎఫ్ వంటి బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి ఎన్‌జిఒ భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, కార్యదర్శి సంతోష్ కుమార్, అసోసియేట్ సభ్యులు జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. దసరా కానుకగా ఉద్యోగులకు డిఎ మంజూరు చేయడం చాలా సంతోషమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ 114వ నెంబర్ జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులతో వరి పంటకు మేలు

గజపతినగరం: వర్షాభావ పరిస్థితులతో యాజమాన్య పద్ధతుల వల్ల వరి పంటకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయాధికారి సిహెచ్ ధనలక్ష్మి అన్నారు. ఆదివారం తమ్మారాయుడుపేట గ్రామంలో వరి పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 9,500 ఎకరాలల్లో వరి పంటను వేశారన్నారు. ఇందులో 400 ఎకరాల్లో వరి పంటకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ వరి పొలాలకు ఎకరాకు 2కేజీల చొప్పున మల్టీకె 13:00:45ను 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయడం వల్ల వారం నుంచి పది రోజులు పాటు పంటకు నీటి కొరత ఉండదన్నారు. రానున్న 3 రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉన్న కారణంగా అంతవరకు పంటను యాజమాన్య పద్ధతులు ద్వారా కాపాడుకోవాలన్నారు. విహెచ్ఎ ధనుంజయ్, రైతులు పాల్గొన్నారు.

రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వొద్దు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీలో కల్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు ఇవ్వవద్దని మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో కల్యాణ మండపం కోసం ఉంచిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలు కోసం పట్టాలు ఇస్తున్నారని, రిజర్వ్ స్థలంలో పట్టాలు ఇవ్వకుండా వేరేచోట పట్టాలు ఇవ్వాలని కోరారు. రిజర్వ్ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఎన్.గోపాలం, టి.సింహాచలం, కె.సత్యం, డి.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

పడాల అరుణను కలిసిన జనసేన నేతలు

బొబ్బిలి: జనసేన పిఎసి సభ్యులుగా ఎన్నికైన పడాల అరుణను బొబ్బిలి నియోజకవర్గ జనసేన నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా ఆమె స్వగృహంలో కలిసి సత్కరించారు. జిల్లాకు చెందిన అరుణ పిఎసి సభ్యులుగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జిల్లాలో జనసేన బలోపేతానికి పని చేయాలని అరుణ కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో దుర్గాదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామానికి చెందిన డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఆలయ ధర్మకర్తలు పడాల గురునాధరావు బ్రదర్స్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

బొబ్బిలి: పట్టణంలోని దాడితల్లి కాలనీలో దేవి నవరాత్రులు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 5వేల మందికి అన్నదానం చేశారు. అన్నదానాన్ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ప్రారంభించారు.

అలరించిన అలనాటి సంగీత విభావరి

విజయనగరం కోట: అలనాటి సంగీత విభావరి అలరించింది. ఆదివారం సాయంత్రం పట్టణ కేంద్రంలో ఆనంద గజపతి ఆడిటోరియంలో ఘంటసాల స్మార్క్ కళా పీఠం భీష్మారావు సారథ్యంలో సాయి, పవన్ సంగీత నిర్వహణలో ప్రముఖ వాయిద్య కారులు, గాయని గాయకులచే సినీ సంగీత విభావరి శ్రోతులను ఎంతగానో అలరించింది. నెలవారి కార్యక్రమంలో భాగంగా ఘంటసాల స్మారక కళాపీటం నిర్వహిస్తున్న ఈ సంగీత విభావరి పట్టణంలో ఉన్న ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. నూతన గాయని గాయకులను ఉత్సాహపర్చడంతో పాటు ఆనాటి మధుర గీతాలను మధుర గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, కార్యదర్శి ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవి వి సత్యనారాయణ, జోగారావు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా వి.లక్ష్మణ, ఎస్.లక్ష్మణ ఎన్నిక

విజయనగరం టౌన్: ఎపి విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ విజయనగరం రీజనల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వి.లక్ష్మణ, సురగాల లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఆదివారం 1104 యూనియన్ కార్యాలయంలో డిస్కం కార్యదర్శి వీఎస్ఆర్‌కె గణపతిరావు, బి.గురునాథరావు పరిశీలనలో ఎన్నిక జరిగింది. సమావేశంలో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.మంగరాజు, మరి కొంతమంది ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రాజేంద్ర ప్రసాద్ 1104 యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

25 నుంచి ఎంపిక పోటీలు

విజయనగరం టౌన్: అండర్-14 విభాగంలో స్విమ్మింగ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను కంటోన్మెంట్ వద్ద ఉన్న ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో 25న నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఎస్.కోటలో బ్యాడ్మింటన్, 27న కొత్తవలసలో వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు పట్టుకొని హాజరుకావాలని సూచించారు.

హోరాహోరీగా క్వార్టర్ ఫైనల్స్

విజయనగరం టౌన్ : అండర్-19 క్రికెట్ మహిళా విభాగంలో జరుగుతున్న క్వార్టర్స్ ఫైనల్ మ్యాచులు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం పివిజి రాజు చింతలవలస క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బరోడా జట్టు విజయం సాధించింది. విజ్జీ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రా జట్టుపై తమిళనాడు గెలుపొందింది. ఆంధ్రా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 247 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు ఒక వికెట్ కోల్పోయి 247 పరుగులు చేసి విజయం సాధించింది. తమిలినాడు జట్టులో కమలినీ 102, సాబ్రిని 105 పరుగులు చేసి విజయంలో కీలకపాత్ర పోషించారు. ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ మైదానంలో మహారాష్ట్ర, హర్యానా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు విజయం సాధించింది.

గడగమ్మలో అన్నీ సమస్యలే

- సాగు, తాగునీటికి తీవ్ర అవస్థలు
- రెండు నెలలు గడుస్తున్నా అందని సాగునీరు
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి కూత వేట దూరాన ఉంది గడగమ్మ గ్రామం. అయినా ఈ గ్రామం అభివృద్ధిపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ గ్రామంలో 270 కుటుంబాలు దాదాపుగా 930 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో సుమారు పది మంచినీటి బోరు బావులు ఉన్నాయి. అయితే ఈ నీళు తాగేందుకు ఉపయోగపడకపోవడంతో గ్రామస్తులు నాగావళి నదిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క తాగునీరే కాదు సాగునీటి సమస్య, గ్రామంలో మౌలిక వసతులు కొరత వేధిస్తుంది.

అన్ని కాలాల్లో నదే దిక్కు

గ్రామంలో బోరుబావులు ఉన్నప్పటికీ తాగేందుకు పనికిరావు. కేవలం ఇతరత్రా

రాళ్లు తేలిన గడగమ్మ రహదారి

అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపాన నాగావళి నది వద్దకు ఎండైనా, వానైనా అక్కడికి వెళ్లి చలమల ద్వారా నీరు తోడుకొని తీసుకొచ్చి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధుల బారిన పడి వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యం నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ గ్రామంలో భూమి 133 ఎకరాల పల్లం, 168 ఎకరాల మెట్టు, ఇతరరాత్ర కలిపి 417 ఎకరాల భూమి సాగులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు లెక్కలు చెబుతున్నారు. గ్రామానికి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి ఛానల్ నుంచి నడిమికెల్ల, విక్రంపురం, కిమ్మి చిట్టిపుడివలస, కొట్టుగుమ్మడ గ్రామాలు దాటి తమ గ్రామానికి సాగునీరు రావాల్సి ఉంది. సర్దార్ గౌతు లచ్చన్న రిజర్వాయర్ నుంచి ఈ ఏడాది జూలై 20న నీటిపారుదల శాఖ అధికారులు సాగునీరు విడిచిపెట్టారు. దాదాపు రెండు నెలలు కావస్తున్నప్పటికీ గ్రామంలో పంట పొలాలకు సాగునీరు రాకపోవడంతో బోరు సదుపాయం ఉన్న వారు పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏ అవకాశం లేని వారు వరుణుడిపై ఆశలు పెట్టుకొని పంటలు సాగు చేస్తున్నారు.

రేకుల షెడ్డులో వంటలు

గ్రామంలో మండల ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 51మంది మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల నాడు-నేడు కింద పాఠశాల అభివృద్ధి పనులు జరిగినప్పటికీ వంటశాలపై దృష్టి సారించకపోవడంతో వర్షం పడినా అందులోనే వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మధ్యాహ్నభోజన నిర్వాహకులు వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ రేకుల షెడ్డు ఎప్పుడు కూలిపోతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ అందులోనే వంటలు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు.

అధ్వాన రహదారితో అవస్థలు

గ్రామానికి వెళ్లే బిటి రహదారి అధ్వానంగా ఉండడం వల్ల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ రహదారి ఎక్కడికక్కడ రాళ్లు తేలిపోవడంతో తరచూగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల కిందట రూ.36లక్షల అంచనా వ్యయంతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టినప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారి ఎక్కడికక్కడ రాళ్లు తేలి దర్శనమిస్తుంది. మూడు కాలాలు ఉండాల్సిన రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కాలం చెల్లక ముందే రహదారులు అధ్వాన స్థితికి చేరుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నది నుండి నీరు తెస్తున్న మహిళలు

కడుబండికి అభినందనల వెల్లువ

- ఎస్.కోట అభ్యర్థిగా శ్రీనివాసరావు పేరు ఖరారు
- వైసిపిలో గ్రూపులకు అధిష్ఠానం చెక్

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పేరు అధిష్టానం ఖరారు చేయడం పట్ల ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ఉత్తరాంధ్ర ఇంచార్జీ వైవి సుబ్బారెడ్డి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా కడుబండి శ్రీనివాసరావు పేరు ప్రకటించడంతో ఎమ్మెల్యేకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. నియోజకవర్గం ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు. నిన్నటి వరకు టిక్కెట్ ఎవరిదో తెలియని డైనమాలో కేడర్ సతమతమవుతున్న తరుణంలో అధిష్టానం పేరు ఖరారు చేయడం వైసిపిలో ఉత్కంఠకు తెరపడింది. తొలి నుంచి ఎస్.కోట వైసిపి రాజకీయాల్లో గ్రూపుల బెడద ఎక్కువే. ప్రధానంగా ఎమ్మెల్సీగా ఇందుకూరు రఘురాజును జగన్మోహన్ రెడ్డి నియమించిన తర్వాత గ్రూపుల గోల పెరిగింది. ఎమ్మెల్యేగా గెలిచిన తొలి నాళ్లలో కడుబండి సమన్వయం చేసుకోవడంలో కాస్త తడబడినా, అనతి కాలంలోనే ఐదు మండలాల నాయకులు పట్ల అపారమైన పట్టు సాధించారు. ప్రభుత్వం పాలన ప్రజలకు చేరువ చేసుకుంటూ, ప్రజలకు అంటిపెట్టుకుని తిరుగుతున్న ఎమ్మెల్యేకు అదే స్థాయిలో ప్రత్యర్థులు సవాళ్ల విసురుతూ, ఆటంకాలు సృష్టించారు. కానీ ఎమ్మెల్యే మాత్రం అధినేత జగన్మోహన్ రెడ్డి మన్ననలు పొందుతూ, ముందుకు సాగిపోయారు. ఒక దశలో ఎమ్మెల్యేకు టిక్కెట్ ఇస్తే, తాము పని చేయమని మరో వర్గం అధిష్టానం ఎదుట చెప్పడానికి వెనకాడ లేదు. దీంతో కడుబండి కూడా అదే స్థాయిలో కేడర్ అభిమానాన్ని చెజారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి పేరు ప్రకటించడం, ఇది జగన్మోహన్ రెడ్డి ఆదేశం అంటూ, పార్టీ సమావేశంలో జిల్లా పెద్దల మధ్య ప్రకటించడం కడుబండి



మంత్రి బొత్స, వైవి సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే(ఫైల్)

అభిమానులకు ఆనందోత్సవాలలో ముంచేసిన అంశం. ఈ నేపథ్యంలోనే దాదాపుగా ఎస్.కోట వైసిపి గ్రూపులకు చెక్ పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా గ్రూపులు పక్కన పెట్టి, కడుబండి విజయానికి కలిసి కట్టుగా కృషి చేస్తారా..? అంటే చెప్పలేని పరిస్థితి. అధిష్టానం ప్రకటనతో రెండో గ్రూపు పార్టీ వీడడం, లేదా కలిసి పని చేయడం మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. అందుకోసమే పార్టీ అధిష్టానం కూడా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడుబండి పేరు ముందుగా ప్రకటించి, గ్రూపులకు కల్లెం వేసినట్లు అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో ఎస్.కోట వైసిపి గ్రూపు రాజకీయాలు ఎటు మలుపు తిరుగుతాయో తెలియాలంటే మరి కొంత కాలం వేచి ఉండవలసిందే మరి.

ఒమ్మి రమణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అధునాతన ప్రబంధం శమంతకమణి

ప్రజాశక్తి- రాజాం

కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మ రచించిన శమంతకమణి ప్రబంధం అధునాతన భావాలతో కూడినదని ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణ మూర్తి చెప్పారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన రాజాం రచయితల వేదిక 105వ సమావేశంలో ఆయన 'శమంతకమణి-బేతవోలు పద్యబాణి' అనే అంశంపై ప్రసంగించారు. భాగవతంలోని కొద్ది పద్యాల శమంతకమణి కథను అధునాతన భావాలతో, ఔచిత్యవంతమైన మార్పులతో, చక్కటి ప్రబంధంగా రాశారని ఆయన అన్నారు. ప్రబంధం కవుల పద్ధతిలో రాసినా, చాలాచోట్ల ఆధునిక భావాలను జొప్పించారని చెప్పారు. 18 ఏళ్ళు నిండిన బాలికకు పెళ్లి చేయడం, సముద్రుడికి అణుజలాంతర్గామి కొడుకుగా పుట్టడం వంటి ఎన్నో ఆధునికమైన, అభ్యుదయ భావాలను ఈ గ్రంథంలో చూడవచ్చని అన్నారు. ఏకాక్షర కందం వంటి పద్యాలను రాసి తన పాండితీ ప్రతిభను కనబరిచారని చెప్పారు. పద్యకవికి ప్రబంధ రచన కష్టమనుకుంటే, వీరు ఈ పనిని సునాయాసంగా చేశారని చెప్పారు. పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, పెంకి దయానిధి నాయుడు, రౌతు గణపతిరావు నాయుడు, తురంగి విశ్వనాథం, బొంతు సూర్యనారాయణ, అంబళ్ళ రామ్మూర్తి, కుదమ తిరుమలరావు, పడాల కవీశ్వరావు, పెంకి చైతన్యకుమార్, వల్లూరు రామినాయుడు, వేగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏయస్ఆర్ నగర్‌లో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. బేపల రాంపైడి ఇంటి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సుమారు రూ.12 లక్షలతో సిసి రోడ్, కాలువ నిర్మాణాలను ప్రారంభించారు. భారత నిర్మాణ కేంద్రం నుండి శ్మశానవాటిక వరకు సుమారు రూ.13 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్, కాలువను ప్రారంభించారు. దంతులూరి వెంకట సూర్యనారాయణ రాజు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

నాయుడు, పంచాయతీరాజ్ డిఇ బంగారు నాయుడు, జెఎఎంసి వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, కరుమజ్జి త్రినాధ్, ఎంపిటిసిలు, గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథం, గాదిపల్లి పెదరామ్మూర్తి, చిన్న రామ్మూర్తి, ఎస్ఆర్‌నగర్ ప్రజలు, పాల్గొన్నారు.

జనావాసాల మధ్య గొర్రెల మందలొద్దు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పెదఖండేపల్లి రహదారిలోని సర్వే నంబరు 188కు చెందిన అనపర్తి వారి భూములను ఇటీవల కొందరు కొనుక్కొని నివాస స్థలాలుగా రిజిస్టర్ చేసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టగా మరికొందరు గొర్రెల మందల కోసం పాకలు వేసి మేకలను, గొర్రెలను ఉంచుతున్నారని వీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, ప్రయివేటు పాఠశాలల యాజమానులు వినతి పత్రాన్ని అందించారు. ఇంతకు ముందు ఈ స్థలాల్లో మందలు ఉండేవి కావని యిప్పుడు వీటి కారణంగా స్వచ్ఛంద సంస్థలు నాటిన మొక్కలు నాశనమవుతున్నాయని చెప్పారు. వీటి అరుపుల కారణంగా ధ్వని కాలుష్యం, వీటి విసర్జనల కారణంగా వాయు కాలుష్యం, వీధి, రహదారి మురికి బట్టి దుర్వాసన భరించలేక పోతున్నామన్నారు. తక్షణమే ఈ మందల స్థావరాలను, పెంట కుప్పలను వేరే ప్రదేశాలకు బదిలీ

వినతిపత్రాన్నిస్తున్న స్థానికులు

చేయించాలని తహశీల్దార్, పంచాయతీ కార్యనిర్వహణాధికారికి, వైద్య ఆరోగ్య శాఖాధికారికి ఫిర్యాదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి సంకీర్తన సేవా మండలి, శ్రీ దత్త సాయి మందిరం కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

ప్రశ్నిస్తే కేసులో పెట్టడమే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి - భోగాపురం

ప్రశ్నిస్తే కేసులో పెట్టడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం 'బాబుతో నేను' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణి చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్మార్గపు ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ చిల్ల జమున, క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి, యూనిట్ ఇంఛార్జి కోండపు ఈశ్వరరావు, పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి కర్రోతు రాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు చిల్లా ధర్మరెడ్డి, జనసేన నాయకులు చిల్ల దాలియ్యరెడ్డి, బూత్ ఇంఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జరజాపు పేటలో ఆదివారం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. పెద్దలు యువత, విద్యార్థులు, ఉద్యోగులు, మాజీ సైనికుల, మాజీ ఉద్యోగులు యువజన సంఘాల ఆధ్వర్యంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండ మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తాగుడు, పేకాట, గంజాయి వంటి అలవాట్లకు గురికాకుండా భవిష్యత్ పై దృష్టి సారించాలని, విద్యతో బాటు ఉపాధి రంగాల్లో నైపుణ్యం చూపించి తలిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. గతంలో మన గ్రామం విద్య, ఉద్యోగ ఉపాధి రంగాల్లో మంచి ఫలితాలు సాధించిన సందర్భాలు ఉన్నాయని ఆ ఫలితాలను తిరిగి తీసుకు రావడానికి అందరం సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

జరజాపుపేటలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

టైల్స్‌ను అందిస్తున్న అప్పలస్వామి

గ్రంథాలయానికి వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో శ్రీరామ యూత్ నిర్మిస్తున్న ఈ-లైబ్రరీకి దాత రూ.30వేలు విలువైన టైల్స్ వితరణ అందజేశారు. గ్రంథాలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన మెరకముడిదాం మండలానికి చెందిన మీసాల అప్పలస్వామి (పంచాయతీ కార్యదర్శి) వార్డు మెంబర్ రెడ్డి మహలక్ష్మి నాయుడు ద్వారా పూర్తి వివరాలు తెలుసుకొని టైల్స్ అందించారు. కాగా త్వరగా నిర్మాణం పూర్తి చేసుకుని వినియోగంలోకి వచ్చి జాబ్ నోటిఫికేషన్‌లో యువత విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అంతర్జాతీయ తైక్వాండోలో కాంస్య పతకం

ప్రజాశక్తి - కొత్తవలస

బంగ్లాదేశ్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో భారత్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సాధించింది. భారత్ నుంచి పాల్గొన్న ములపర్తి ప్రకాష్ రావు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారత్‌కు కాంశ్య పతకం సాధించి పెట్టాడు. మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబంలో జన్మించిన ఈయన పతకం సాధించడం గొప్ప విషయం. ప్రకాష్‌రావు సెమీ ఫైనల్‌లో నేపాల్ ప్లేయర్‌తో పోటీ పడి ఓటమి పొంది కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. పతకం సాధించిన ప్రకాశ్‌రావును పలువురు అభినందిస్తున్నారు.

26న బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

శృంగవరపుకోట: ఈ నెల 26వ తేదీన ఎస్ కోట వైజాగ్ రోడ్‌లో పుణ్యగిరి కాలేజ్ ఎదురుగా ఉన్న సిరికి రిసార్ట్స్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాలురు, బాలికల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఆదివారం సిరికి రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో

కాంస్య పతకం సాధించిన ప్రకాశ్ (తెల్లచొక్క)

ఉండే 9 నియోజకవర్గాల నుండి 180 మంది బాలురు, బాలికలు వస్తున్నారని వారికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు త్వరలో విశాఖపట్నంలో జరగబోవు రాష్ట్ర స్థాయి స్కూల్స్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో మన జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. ఈ ఎంపిక పోటీలకు తమకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తున్న సిరికి రిసార్ట్స్ యాజమాన్యం చిత్రగుప్తకి ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు గురువారం ఉదయం 9గంటల కల్లా హాజరు కావాలని, క్రీడాకారులు క్రీడా దుస్తులతో, షూష్, బ్యాట్స్, షటిల్ కాక్స్, ఎవరివి వారే తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలు కోసం 7989199534, 9490265104 నెంబర్లను సంప్రదించాల్నఅన్నారు.

ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలం సీతారాముని పేట గ్రామంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను టూరిజం రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు ఆదివారం సత్కరించారు. శ్రీగురజాడ విజ్ఞాన గ్రామీణ గ్రంథాలయం స్థాపించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామానికి చెందిన కొంతమంది ఉద్యోగస్తులు గ్రంథాలయంలో చదివి ఇటీవల సచివాలయం, బిఎస్ఎఫ్, కొన్ని శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించారు. గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, మాజీ సర్పంచులు రామారావు, బూర్లు సత్యం, ఉద్యోగస్తులు అట్టాడ సన్యాసిరావు, అరసవిల్లి రామారావు, శ్రీరామ్, రమణ, పతివాడ బలరాం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిగా శ్రీధర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతి టిడిపి క్లస్టర్ ఇంఛార్జిగా అట్టాడ శ్రీధర్ నియమితులయ్యారు. ఆదివారం నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు నూతన క్లస్టర్ ఇంఛార్జిగా అట్టాడ శ్రీధర్ (బుజ్జి)ని నియమించారు. శ్రీదర్ మాట్లాడుతూ నగర పంచాయతీలో కౌన్సిలర్స్, యూనిట్ ఇంఛార్జిలు, బూత్ కన్వీనర్స్ సహకరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

380 మద్యం సీసాలు సీజ్

గుర్ల: మండలంలో కెల్ల గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. ఆతని వద్ద నుండి 380 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తెర్లాం: మండలంలోని గొలుగువలస గ్రామంలోని లింగిబేరివాణి చెరువులో గుర్తు తెలియని మృతదేహన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంచార్జి ఎస్ఐ సురేందర్ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదుపులో ఇద్దరు యువకులు

భోగాపురం : కొట్లాట కేసుకు సంబంధించి మరో ఇద్దరు యువకులను భోగాపురం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పెద్ద కొండరాజుపాలెంలో పండుగ సందర్భంగా తోటపల్లి ప్రభుత్వ మద్యం షాపు వద్ద ఇటీవలి కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో వీరిని సోమవారం కోర్టుకు తరలించనున్నారు.